


నిష్పక్షపాత నిర్భయ నిజనివేదనం

# నేటిధాత్రి®

22ND ANNIVERSARY

తెలుగు వార్త పత్రిక

మంగళవారం 05-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 34 రూ॥ 6.00







# వికసించిన కమలం..
# పరువు నిలుకున్న హస్తం!

## రెండు చోట్ల నిలుపుకున్న ప్రభుత్వం..
## బెంగాల్ బీజేపీకి అదనం.
## •కాంగ్రెస్ హస్తగతమైన కేరళం.



బెంగాల్ | కేరళ | తమిళనాడు | అస్సాం | పుదుచేరి




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888







అనూహ్యంగా విజయ్ సంచలనం.

- •ఇప్పట్లో బీజేపీని కొట్టుడు అన్ని పార్టీలకు కష్టమే!
- •నేటిధాత్రి గత పదేళ్లుగా చెబుతున్నదే నిజమని తేలుతోంది.
- •ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనేది నేటిధాత్రి ముందే చెప్పింది.
- •ప్రత్యేకంగా టివికె సింగల్ లార్జెస్ట్ పార్టీ అని ముందే ఒక్క నేటిధాత్రి మాత్రమే చెప్పింది

| | | | |
|---|---|---|---|
| ✔ బెంగాల్ ను ఈ సారి కసితో పనిచేసి బీజేపీ దక్కించుకున్నది. | ✔ ఆ కసి కాంగ్రెస్ లో ఎక్కడా కనిపించడం లేదు. | ✔ ఏఐఏడిఎంకె రూపంలో తమిళనాడు లో బీజేపీ పాగా వేసినట్లే! | ✔ కర్ణాటక లో అధికారం చేపట్టిందే. |

- •బీజేపీ హ్యాట్రిక్ ల మీద హ్యాట్రిక్ లు కొడుతోంది.
- •మళ్ళీ మళ్ళీ అన్ని రాష్ట్రాలలో గెలుస్తోంది.
- •ఇటీవల కాలంలో అధికారం కోల్పోయిన రాష్ట్రం ఒక్కటీ లేదు.
- •ఉత్తరాదిలో బీజేపీ ని ఓడించడం అంత సులువు కాదు.
- •కాంగ్రెస్ మైండ్ సెట్ మార్చుకోక పోతే గెలిచే ముచ్చటే కనిపించడం లేదు.
- •కాలానికి అనుగుణంగా మారకపోతే కాంగ్రెస్ కు భవిష్యత్తు లేదు.
- •హిందుత్వ నినాదం అందుకోకపోతే కాంగ్రెస్ గెలిచే పరిస్థితి కనిపించడం లేదు.
- •బీజేపీ బలంగా లేని చోట మాత్రమే కాంగ్రెస్ గెలుస్తోంది.
- •ఇప్పటికైనా నిజాన్ని గ్రహించకపోతే కాంగ్రెస్ కు కష్టమే!
- •దక్షణాదిలో బీజేపీ ఇంకా దూరడం లేదు.
- •ఒక రకంగా సాధ్యం కావడం లేదు.
- •ఉత్తరాధిలో కాంగ్రెస్ కు ఊపిరాడడం లేదు.
- •అస్సాం లో బీజేపీ మళ్ళీ గెలిచింది.
- •పుదుచేరిలోనూ మళ్ళీ కమలం వికసించింది.

## •ఇక మిగిలింది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లే మిగిలి వున్నాయి.
## •బీజేపీ దేశమంతా బలపడితే ప్రాంతీయ పార్టీలు కనుమరుగే!

# •జమిలి కి ఇక బిజెపి సిద్ధమే నేటిధాత్రి ముందే చెప్పినట్టుగా 2027 లో ఎన్నికలే

హైదరాబాద్, నేటిధాత్రి:
దేశంలో బిజేపి వరస విజయాలతో దూసుకుపోతోంది. ఏ ఎన్నికలు వచ్చినా విజయం సొంతం చేసకుంటోంది. చెప్పి మరీ గెలుస్తోంది. గెలుస్తామని సవాలు చేసి మరీ, అక్కడ పాగా వేస్తోంది. రాజకీయాలు మార్చేస్తోంది. అంతగా బిజేపిని ప్రజలు కోరుకుంటున్నారు. నాయకులను ఆదరిస్తున్నారు. గెలిపిస్తున్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో బిజేపి అది చేస్తోంది. బిజేపి ఏది అనుకుంటుందో అది జనం కూడా మెచ్చుకుంటున్నారు. అందుకే ఇలా వరుస విజయాలు బిజేపికి దాసోహమౌతున్నాయి. బిజేపి అదికారంలో వున్న ఏ రాష్ట్రంలోనూ రెండోసారి, మూడో గెలుస్తున్నాయి. అలా గెలవడానికి ఎక్కడా పెద్దగా శ్రమటోడ్చాల్సిన అవసరం కనిపించడం లేదు. ఎంతో సునాయాసంగా గెలుస్తున్నారు. సహజంగా ఏ రాష్ట్రంలో నైనా సరే ఒకసారి అదికారం చేపట్టిన పార్టీ, మరుసటి ఎన్నికల్లో ఓడిపోవడం జరుగుతుంది. లేకుంటే ఎంతో కొంత మెజార్టీ తగ్గిపోతుంది. కాని బిజేపి పాలించిన అన్ని రాష్ట్రాలలోనూ మెజార్టీ పెంచుకుంటూ వస్తోంది. అలా చూసుకుంటే బిజేపి గుజరాత్‌లో ఏకంగా వరుసగా ఏడు ఎన్నికల్లోనూ విజయం సాదిస్తూ వస్తోంది. అలా విజయాల పరపరంలో చాలా రాష్ట్రాలలో హ్యాట్రిక్ విజయాలు సొంతంచేసుకుంటూ వస్తోంది. మహారాష్ట్ర, హర్యానా, బిహార్, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా రాష్ట్రాలున్నాయి. ఇప్పుడు తాజాగా కూడా రెండోసారి అస్సాంలో బిజేపి మరోసారి జయకేతనం ఎగురవేసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఇటీవలే జరిగాయి. ఆ ఎన్నికల్లో ఇప్పటికే బిజేపి రెండు రాష్ట్రాలలో అధికారంలో వుంది. అస్సాంలో గత ఐదేళ్లలో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. కాని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. కాని వారి మాటలు జనం ఎప్పుడూ నమ్మలేదు. ఎన్నికల సమయంలోనే కాదు, ఇతర సమయాల్లో కూడా ప్రతిపక్షాలకు ప్రజల మద్దతు కరువయ్యేది. అయినా ప్రతిపక్షంలో వున్నప్పుడు ఏవో ఆరోపణలు చేయాలని చేసేవి. కాని ప్రజలు బిజేపి పక్కనే నిలిచారు. దాంతో అస్సాం ఎన్నికల ముందే ప్రతిపక్ష కాంగ్రెస్ చేతులెత్తేసిందని చెప్పక తప్పదు. అందుకే ప్రీ పోల్ సర్వేల్లోనూ, ఎగ్జిట్ ఫోల్ సర్వేలలోనూ అందరూ బిజేపికే జై కొట్టారు. అదే ఎన్నికల ఫలితమయ్యింది. మరో పుదిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలోనూ ఎన్డీయే గెలిచింది. ఇది కూడా అందరూ ముందు నుంచి ఊహిస్తూ వస్తున్నదే. అయితే అసలైన ట్విస్టు మాత్రం బెంగాల్‌లో జరిగింది. ముందు నుంచి ఈసారి బెంగాల్‌లో గెలుస్తామని బిజేపి చెబుతోంది. అందుకు గట్టిగా ప్రయత్నం చేస్తూ వచ్చింది. బెంగాల్ వరుసగా మూడు సార్లు విజయం సాదించిన మమత బెనర్జీ మీద ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. అది బిజేపికి అనుకూలంగా మారింది. పైగా కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఎన్నికలు ముందు పదిహేను రోజులు అక్కడే మకాం వేశారు. గత రెండేళ్ల కాలంగా ఎక్కువగా బిజేపి బెంగాల్ మీద ఫోకస్‌చేసింది. ఎలాగైనా ఈసారి బెంగాల్‌లో గెలవాలన్న పట్టుదలతో సాగింది. బిజేపి గెలిస్తే బెంగాల్‌కు ఏం చేస్తామనే విషయాలను బిజేపి స్పష్టంగా కొంత కాలంగా చెబుతూ వస్తున్నారు. ప్రజలు బిజేపిని విశ్వసించారు. ఎలాగూ ఓడిపోయే పరిస్దితులు కనిపిస్తున్నాయని అనుకున్న తృణమూల్ అధినేత్రి మమత బెనర్జీ అడుగడుగునా బిజేపిని అడ్డుకుంటూ వచ్చింది. ప్రతి సందర్భాన్ని విమర్శిస్తూ రాజకీయం చేసింది. అయినా బిజేపి తాను ఏం చేయాలనుకున్నదో అదే చేసుకుంటూ వెళ్లింది. ప్రజలు కూడా బిజేపి చేస్తున్న ప్రతి పనిని సమర్ధిస్తూ వచ్చారు. తీరా ఎన్నికల సమయంలో బిజేపిని ఆశీర్వదించారు. ఈ ఎన్నికల్లో అసలు విజయం అంటే బెంగాల్‌లోనే, అది బిజేపి ప్రజలిచ్చిన గొప్ప కానుకగా చెప్పుకోవచ్చు. బిజేపిని రానికవ్వకపోవడమే రాజకీయం అనేలా మమత బెనర్జీ రాజకీయం చేస్తూ, పాలన గాలికి వదిలేశారు. తన పని తాను చేసుకుంటూ పోకుండా తన కాన్‌సంట్రేషన్ అంతా బిజేపి మీదనే పెట్టింది. దాంతో ప్రజలు కూడా మమత ప్రజల కోసం కాకుండా, రాజకీయం కోసమే వుందన్న ఆలోచన ప్రజలు చేశారు. ఈ ఎన్నికల్లో ఓడించారు. కాని దాదాపు అన్ని సర్వే సంస్ధలు బిజేపి ఈసారి తృణమూల్‌కు గట్టిపోటీ ఇస్తుందని రాశాయే గాని, బిజేపి గెలుస్తుందని చాలా తక్కువ సంస్ధలు చెప్పాయి. ప్రజల నాడిని అంచనా వేయడంలో ఇక్కడ కూడా సర్వే సంస్ధలు చాలా వరకు విఫలమయ్యాయి. ఇక మరో రాష్ట్రం తమిళనాడు. ఆ రాష్ట్రంలో కూడా సర్వే సంస్ధలు అన్నీ మళ్లీ డిఎంకేదే అదికారం అని రాస్తూ వచ్చాయి. కాని ఒకే ఒక్క సర్వే సంస్ధ డిప్యాక్, నేటిధాత్రి దిన పత్రిక మాత్రమే ముందు నుంచి విజయ్ గెలుసు ఖాయమని చెబుతూ వచ్చింది. ఎన్నికల సమయంలోనూ ఒకే ఒక్క పత్రిక నేటిధాత్రి మాత్రమే ఈసారి విజయ్‌దే విజయం అనిచెప్పింది. సింగిల్ లార్జెస్టు పార్టీగా టివికే విజయం సాదిస్తుందని కూడా ముందే చెప్పిన ఏకైక సంస్ధ నేటిధాత్రి. ఇక కేరళ విషయంలోనూ నేటిధాత్రి చెప్పిందే నూటికి నూరు పాళ్లు నిజమైంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాదిస్తుందని నేటిధాత్రి మాత్రమే చెప్పింది. ఖచ్చితంగా కాంగ్రెస్ వంద సీట్లకు పైగా సాధిస్తుందని చెప్పిన ఏకైక పత్రిక నేటిధాత్రి. కాని ఏ సర్వే సంస్ధ ఇంత కచ్చితమైన లెక్కను చెప్పలేదు. ఎల్డీఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య గట్టిపోటీ వుంటుందని మాత్రమే చెప్పాయి. కొన్ని సర్వే సంస్దలు యుడిఎఫ్ గెలుస్తుందని చెప్పాయే గాని, తక్కువ మార్జిన్‌తో మాత్రమే గెలుస్తాయని చెప్పడం జరిగింది. కాని ఒక్క నేటిధాత్రి మాత్రమే ఖచ్చితమైన లెక్క వేసి చెప్పడం జరిగింది. అదే నిజమైంది. సిఎంగా కేసి. వేణుగోపాల్ ను చేస్తారని కూడా చెప్పడం జరిగింది. అది కూడా నిజమయ్యే ఛాన్సు వుంది. అయితే ఇక్కడ బిజేపి, కాంగ్రెస్‌లు మాత్రవే జాతీయ స్దాయిలో వుండాలన్న లక్ష్యంతోనే సాగుతున్నాయనేది అర్ధమౌతున్నాయి. కాని ప్రజల నాడిని బట్టి కాంగ్రెస్ రాజకీయాలు చేయడం లేదన్న విషయం అర్ధమౌతోంది. ప్రజలు కూడా పదే పదే బిజేపిని ఎందుకు గెలిపిస్తున్నారన్న దానిపై లోతైన విశ్లేషణ చేసుకోకుండా కాంగ్రెస్ వెనుకబడిపోతోంది. ప్రజలు హిందుత్వ భావజాలాన్ని పూర్తిగా నమ్ముతున్నారు. ప్రజల మధ్య కొన్ని దశాబ్దాలుగా బరి గీసి వున్న గీతను అర్దం చేసుకున్నది ఒక్క బిజేపి మాత్రమే అని అనుకుంటున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ విస్మరిస్తూ వస్తోంది. ప్రజలు అభివృద్ధి, సంక్షేమమే కాదు, కొన్నిసార్లు ఆత్మగౌరవం కూడా కోరుకుంటారు. అలాంటి ఆత్మగౌరవాన్ని కేవలం ఎన్నికల కోసం కాంగ్రెస్ తాకట్టుపెట్టిందన్న విమర్శలు కాంగ్రెస్ చాలా కాలం నుంచి ఎదుర్కొంటోంది. అయినా ఆ పార్టీ తేరుకోలేకపోయింది. ఎన్నికల్లో గెలవడం కోసం మైనార్టీ ఓట్లను కాంగ్రెస్ నమ్ముకున్నది. మైనార్టీ ఓట్లు గుండుగుత్తగా పడితే చాలు గెలుస్తామని భావిస్తూవచ్చింది. కాని బిజేపి మెజార్టీ ఓట్లను రాబడుతూ విజయం సాదిస్తోంది. దానిని ఇంకా కాంగ్రెస్ అర్దం చేసుకోలేకపోతోంది. బిజేపికి కేవలం మత రాజకీయం అనే ఆరోపణల దగ్గరే కాంగ్రెస్ ఆగిపోతోంది. అందుకే ఓడిపోతోంది. అయినా కాంగ్రెస్ అంతర్మరధనం చేసుకోవడం లేదు. ప్రజల నాడిని పట్టుకొని రాజకీయాలు చేయాల్సిన పార్టీలు, తమ సిద్దాంతాలు, రాద్దాంతాల కోసం ఓట్లు వేయమంటే వేయరు అనే సత్యాన్ని కాంగ్రెస్ గ్రహించడం లేదు. ప్రజల మధ్య కొన్ని గీతలు అలాగే వున్నాయి. వాటిని అవతలి వ్యక్తులు చెరిపేసుకోవాలన్న ఆలోచనతో లేరు. కాని మరో సమాజమే గీతలను చెరిపేసుకొని తమతో కలిసి సాగాలని కోరుకుంటున్నారు. ఇది మెజార్టీ సమాజం అంగీకరించదు. ఆ విషయాన్ని దేశ ప్రజలు ఇప్పటికీ మూడు కేంద్ర ఎన్నికల సమయంలోనూ, అనేక రాష్ట్రాల గెలుపుల్లోనూ స్పష్టంగా ప్రజా తీర్పుతో చెబుతున్నారు. కాని కాంగ్రెస్ దాని గురించి పట్టించుకోవడం లేదు. లౌకిక ప్రజాస్వామ్యమంటే కేవలం హిందూ సమాజమే అన్ని త్యాగాలు చేయాలని ఎక్కడా లేదు. ప్రతి సందర్భంలోనూ మైనార్టీ ప్రజల బాగోగులు మాత్రమే కొన్ని పార్టీలు పదే పదే స్మరిస్తుంటాయి. మెజార్టీ జనాభా మనోభావాలను కాంగ్రెస్ గుర్తించలేదు. అందుకే బిజేపి వైపు ప్రజలు చూస్తున్నారు. బిజేపి మాత్రమే మెజార్టీ ప్రజల మనోభావాలను కాపాడుతుందని నమ్ముతున్నారు. అందుకే బిజేపిని ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు గెలిపిస్తూ వస్తున్నారు. ఒక్కసారి గెలిచిన తర్వాత ఎక్కడా బిజేపి ఓడిపోవడం లేదు. ఇది ప్రజల కోణంలో సాగుతున్న పార్టీగా గుర్తింపు పొందుతోంది. అందుకే బిజేపి వరుస గెలుపులు తన ఖాతాలో వేసుకుంటోంది.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



# నేటిధాత్రి ®

నిష్పక్షపాత వార్తల నిజదర్పణం

తెలుగు వార్త పత్రిక



మంగళవారం 5-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 34 రూ॥ 6.00



నేటిధాత్రి ®

నిష్పక్షపాత వార్తల నిజదర్పణం

22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్లు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ **"22 వ వసంతం"** లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## "నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో

**మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్పూర్తిగా కోరుకుంటూ....**



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

Corporate Office Address :

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034



నిష్పక్షపాత నిర్భయ నిజరూపం
22ND ANNIVERSARY
# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక



మంగళవారం 05-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 34 రూ|| 6.00


## బీజేపీకి మరింత శక్తి!

డెస్క్, నేటిధాత్రి:
బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు

12 లో

## పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- భారీగా బందోబస్తు ఏర్పాటు
- బెంగాల్ కౌంటింగ్‌పై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం

12 లో



## బెంగాల్‌లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యం

- ఎస్ఆర్ ప్రక్రియతో ఓట్ల దోపిడీ చేశారని ఆరోపణలు
- మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు

కోల్‌కతా, నేటిధాత్రి:
పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 190 స్థానాల్లో ముందంజలో

12 లో



## కేరళలో యూడీఎఫ్‌కు పూర్తి ఆధిక్యం

- కేరళ కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు
- కేక్ కట్ చేసి స్వీట్లు పంచిన కె.సి. వేణుగోపాల్
- ప్రజలు మార్పు కోరుకున్నారన్న శశి థరూర్

తిరువనంతపురం, నేటిధాత్రి:
కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్

04 లో

## తెలంగాణలోనూ ఇక బీజేపీ ఖాయం



- ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వ్యాఖ్యలు

12 లో

హైదరాబాద్, నేటిధాత్రి:
తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా



# స్టార్ నుంచి సీఎం...!
# జన నాయగన్
## ద్రావిడ కోటలపై దళపతి దాడి.. తమిళ రాజకీయాల్లో తుఫాను!

- విజయ్ ఇంటి వద్ద పోలీసు బలగాల మోహరింపు
- విజయోత్సవాల్లో విజిల్స్ ఊదిన కుటుంబ సభ్యులు

### స్టార్ నుంచి సీఎం దాకా విజయ్ జైత్రయాత్ర.. 49 ఏళ్ల చరిత్రకు కొత్త మలుపు!
### టీవీకే సునామీ.. డీఎంకే, అన్నాడీఎంకేలకు భారీ షాక్!

చెన్నై, నేటిధాత్రి:
తమిళనాడు రాజకీయ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ప్రజలు ఈసారి స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలకు గట్టి గుద్దు కొడుతూ, సినీ నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళధాత్రి:గ వెట్రి కళగం (టీవీకే) అప్రతిహతంగా దూసుకుపోతోంది. తాజా ఫలితాల ధోరణిలో టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ఆధిక్యంలో ఉండటం రాజకీయ వర్గాలను సంచలనం గావిస్తోంది.

మొత్తం 234 స్థానాల అసెంబ్లీలో మెజారిటీ మార్క్ 118 కాగా, టీవీకే ఆ లక్ష్యానికి చేరువలో నిలవడం రాష్ట్రంలో కొత్త శకానికి సంకేతంగా మారింది. ప్రజల తీర్పు స్పష్టంగా మార్పును కోరుకుంటున్నదనే విషయాన్ని తెలియజేస్తోంది.

**ద్రావిడ రాజకీయాలపై ప్రజల తిరుగుబాటు**

1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే తప్ప మరో పార్టీ అధికారానికి చేరువ కావడం ఇదే తొలిసారి. దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ రాజకీయాలు,

- ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం
- అనూహ్యంగా దూసుకు వచ్చిన విజయ్ పార్టీ
- మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు
- తమిళనాడు సీఎం స్టాలిన్ ఘోర పరాజయం
- ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి
- పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు

అవినీతి ఆరోపణలు, ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రభావం చూపాయి.

12 లో

## తమిళనాడులో విజయ్ పార్టీ విజయం ఖాయం

- ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్
- ఆనాటి దృశ్యం సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని పార్టీ 98 నుంచి 120 స్థానాలు గెలుచుకుంటుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందుగానే జోస్యం చెప్పారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ భారీ ప్రభావం చూపుతుండగా, ఆయన గెలుపు ఖాయమని అప్పుడే చెప్పిన ఆ వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. ఆ సమయంలో ఇచ్చిన ఇంటర్వ్యూ దృశ్యం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో

04 లో

## ముందుగానే అంచనా నిజం
### మా అంచనాలే నిజమయ్యాయి: ప్రదీప్ గుప్తా




న్యూఢిల్లీ, నేటిధాత్రి:
తమిళనాడులో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన విజయ్ నేతృత్వంలోని పార్టీ ప్రస్తుతం 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అధికారాన్ని కొనసాగిస్తుందని భావించిన పార్టీ వెనుకబడిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ సర్వే సంస్థ అధిపతి ప్రదీప్ గుప్తా ఒక దూరదర్శన సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. తమ అంచనాల ప్రకారం

04 లో



- కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం
- శనగ పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు లేవు
- సదాశివపేటలో రైతులను పరామర్శించిన కేటీఆర్

# రైతులకు అండగా నిలుస్తాం
## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

సంగారెడ్డి, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట కోతకు వచ్చి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా కూడా సకాలంలో అందడం లేదన్నారు.

సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో మాట్లాడిన కేటీఆర్, అన్ని పంటలను కొనుగోలు చేస్తామని చెప్పి ఈ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఏ పంటను సక్రమంగా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.

95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇంకా పూర్తిగా ప్రారంభం కాలేదన్నారు. ధాన్యాన్ని దళారుల చేతుల్లోకి నెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు. సివిల్ సరఫరా సంస్థలో భారీ అక్రమాలు జరిగాయని, అందుకే కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రులు కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా అని రైతులను ప్రశ్నించారు. భూముల కొనుగోళ్లు, స్థల వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగుపాటు, గుండెపోటు వంటి కారణాలతో రైతులు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా నిలుస్తామని కేటీఆర్ తెలిపారు. అవసరమైతే తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సదాశివపేటలోని శనగ కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆరఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## అవినీతిని ప్రశ్నించినందుకే అరెస్టు

- జైలులో బీఆరఎస్ నేతకు పరామర్శ
- ఫోన్లు వినికిడి కింద ఉన్నాయన్న కేటీఆర్ ఆరోపణ

సంగారెడ్డి, నేటిధాత్రి:
కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించినందుకే మన్నే క్రిశాంక్‌ను అన్యాయంగా అరెస్టు చేసి జైలుకు పంపారని కేటీఆర్ ఆరోపించారు. ఆయనపై అనేక కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని విమర్శించారు.

సోమవారం సంగారెడ్డి కేంద్ర కారాగారాన్ని కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు. జైలులో ఉన్న క్రిశాంక్‌ను కలుసుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, క్రిశాంక్ ఒక విద్యావంతుడు, న్యాయవాది, పరిశోధకుడని తెలిపారు. విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని, రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశారని గుర్తు చేశారు.

గత కొంతకాలంగా ప్రభుత్వ అక్రమాలను బయటపెడుతున్నందుకే ఆయనపై వరుసగా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. చిన్న కేసుల్లో కూడా బెయిల్ ఇవ్వకుండా జైలులో ఉంచడం అన్యాయమని మండిపడ్డారు.

రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై కేసులు పెట్టడంలో బిజీగా ఉందని



విమర్శించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఫోన్ సంభాషణల వినికిడి, గూఢచర్యం, పాత్రికేయులపై వేధింపులు జరుగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. న్యాయస్థానం ఆదేశాలను కూడా పట్టించుకోకుండా అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ అన్యాయాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని, పార్టీ కార్యకర్తలు భయపడవద్దని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## మోదీ నాయకత్వానికి ప్రజల మద్దతు
### ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు నాయుడు స్పందన



అమరావతి, నేటిధాత్రి:
ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో

04 లో

## దేశమంతా డబుల్ ఇంజిన్ సర్కార్ ఖాయం

- స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



కరీంనగర్, నేటిధాత్రి:
దేశమంతా ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

12 లో

## టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపిన హరీష్‌రావు



హైదరాబాద్ , నేటిధాత్రి:
తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించడం పట్ల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు ట్విటర్‌లో స్పందించారు. ఈ సందర్భంగా టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడు రాజకీయాల్లో అద్భుతమైన అరంగేట్రం చేసిన నటుడు విజయ్‌కు అభినందనలు తెలిపారు ఈ ప్రజా తీర్పు ప్రజల ఆశలను ప్రతిబింబిస్తోందని, ప్రజా జీవితంలో ఆయన తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం

- సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
- వాహనం నిలిచిపోతే 14449కు కాల్ చేయండి
- వాహనదారులకు కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, నేటిధాత్రి:
హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే

04 లో

# బెంగాల్‌లో బీజేపీ విజయం చారిత్రాత్మకం.. 2026 ఎప్పటికీ గుర్తుండిపోతుంది: ప్రధాని మోదీ



నేటిధాత్రి డెస్క్ :

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ విజయం చారిత్రాత్మకమని మోదీ అన్నారు. ఎన్నికల్లో గెలిచిన ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడింట విజయం సాధించింది. అసోం, పుదుచ్చేరిలో బీజేపీ కూటమి గెలిచింది. వీటితోపాటు పశ్చిమ బెంగాల్‌లో గెలవడం బీజేపీకి భారీ ప్రోత్సాహాన్నిచ్చింది. ఈ విజయంపై మోదీ స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో కమలం వికసించిందని సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

2026 ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, అసోం ప్రజలు మరోసారి ఎన్డీయేను ఆశీర్వదించారని మోదీ అన్నారు. తమిళనాడులో టీవీకే అద్భుత విజయం సాధించిందని ప్రశంసించారు. తమిళనాడు ప్రజల సంక్షేమం, ప్రగతికి కేంద్రం సాయం అందిస్తుందని మోదీ తెలిపారు. బెంగాల్‌లో సాధించిన విజయం.. ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు సాగించిన పోరాటానికి ఫలితం అన్నారు. కార్యకర్తలు లేకుంటే విజయం సాధ్యమయ్యేది కాదని చెప్పారు. బెంగాల్ ప్రజల కోసం, వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడం కోసం బీజేపీ అన్నివిధాలుగా తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రశంసించారు.

బెంగాల్‌లో ప్రజాశక్తి నిలబడిందని, బీజేపీ రాజకీయాలు మంచి పాలనకు నాంది అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తామని తెలిపారు. అసోంలో బీజేపీ కూటమి సాధించిన విజయం.. అక్కడి ప్రజల అభివృద్ధికి, జీవితాల్లో మార్పు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనమని వివరించారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి కూడా ప్రధాని అభినందనలు తెలిపారు. వికసిత్ కేరళ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిలో కూడా ఎన్.రంగస్వామి ఆధ్వర్యంలోని బీజేపీ కూటమి విజయం సాధించడంపై కూడా మోదీ హర్షం వ్యక్తం చేశారు. తమ పనితీరు ఆధారంగా ప్రజలు మరోసారి అధికారాన్ని అందించారని పేర్కొన్నారు.

# పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీకి పరాభవం..

## ఈ కారణాలే కొంపముంచాయా..?

నేటిధాత్రి డెస్క్ :

పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేకుండా 15 ఏళ్లపాటు సాగిన మమతా బెనర్జీ పాలనకు తెరపడింది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ ప్రభుత్వం ఓటమి దిశగా సాగుతోంది. బీజేపీ అధికారం దక్కించుకునేందుకు సిద్ధంగా ఉంది. పూర్తి ఫలితాలు వెల్లడించడమే ఆలస్యం. అయితే, 15 ఏళ్లపాటు సాగిన మమతా బెనర్జీ పాలనను దెబ్బకొట్టి, పార్టీని ఓడించిన అంశాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. విశ్లేషకుల అంచనా ప్రకారం టీఎంసీ ఓటమికి మొదటి కారణం ఆర్జీ కర్ హత్యాచార ఘటన. ఈ ఘటన విషయంలో మమతా బెనర్జీ, ఆమె పార్టీ వ్యవహరించిన తీరుపై చాలా మందికి వ్యతిరేకత ఉంది. ఘటనలో బాధితురాలి తప్పే ఉందన్నట్లు ఆమె వ్యవహరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంలో సరిగ్గా వ్యవహరించలేదు. దీంతో మహిళలు, యువత మమతపై ఆగ్రహంతో ఉన్నారు. ఇదే సమయంలో బాధితురాలి తల్లికి బీజేపీ అసెంబ్లీ సీటు ఇచ్చి మరీ పోటీ చేయించింది. ప్రస్తుతానికి ఆమె విజయం దిశగా సాగుతోంది. హత్యాచార ఘటనలో మృతురాలి తల్లి పోటీ చేయడంతో సానుభూతి వ్యక్తమై బీజేపీకి మద్దతు పెరిగింది. జన్ జీ, జన్ ఎక్స్ యువత ఎక్కువగా బీజేపీకి అండగా నిలిచారు. టీఎంసీ సాగించిన గూండాయిజం, కార్యకర్తల దాడులు వంటి వాటితో ప్రజలు విసిగిపోయారు.

మరోవైపు మమత సన్నిహితులపై జరిపిన దాడుల్లో భారీగా అక్రమ నగదు పట్టుబడింది. ఇది కూడా మమత ఇమేజ్ మసకబారడానికి కారణాలు. ఇక ఈ ఎన్నికల్లో టీఎంసీ అనుసరించిన వ్యూహం మరో తప్పిదంగా చెప్పుకోవచ్చు. బీజేపీని బయటి పార్టీగా టీఎంసీ చెప్పుకొచ్చింది. కానీ, బీజేపీ మాత్రం మమత ప్రభుత్వం అవినీతి, అక్రమాల గురించి ప్రస్తావించింది. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో టీఎంసీ విఫలమైందని ఆరోపించింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసదారుల్ని అడ్డుకోవడంలోనూ టీఎంసీ విఫలమైందని బీజేపీ విమర్శించింది. ఇక, ఇటీవల కేంద్రం నిర్వహించిన సర్ అంశంలో ఓట్ల తొలగింపు కూడా ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు.

# కేరళలో యూడీఎఫ్‌కు పూర్తి ఆధిక్యం



- కేరళ కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు
- కేక్ కట్ చేసి స్వీట్లు పంచిన కె.సి. వేణుగోపాల్
- ప్రజలు మార్పు కోరుకున్నారన్న శశి థరూర్

తిరువనంతపురం, నేటిధాత్రి:

కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. ప్రస్తుతం యూడీఎఫ్ 97 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, అధికార ఎల్‌డీఎఫ్ 42 స్థానాల్లో ముందంజలో ఉంది. ఈ నేపథ్యంలో యూడీఎఫ్ విజయం తథ్యంగా కనిపిస్తోంది.

దీంతో కేరళ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ మొదలైంది. ఈ విషయంపై కాంగ్రెస్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ స్పందించారు. రాష్ట్రంలో ఓటర్లు మార్పు కోరుకుంటున్నట్లు ఈ ఫలితాలు స్పష్టంగా సూచిస్తున్నాయని తెలిపారు. పాలనలో మరింత నిర్మాణాత్మకత, దూరదృష్టి అవసరమని ఓటర్లు భావిస్తున్నట్లు చెప్పారు. పాలక కూటమికి చెందిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రజలు వ్యతిరేకంగా ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. వారికి ఓటు వేయడం అంటే దుష్పరిపాలన కొనసాగడమేనని ప్రజలు గ్రహించారని అన్నారు. ఇది ఓటర్ల విచక్షణకు గొప్ప నిదర్శనమని వ్యాఖ్యానించారు.

"ఫలితాలు ఊహించిన దానికంటే మెరుగ్గా ఉన్నాయి. ఇక్కడ సులభంగా మెజారిటీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయగలం. అయితే తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది నాకు తెలియదు. ఆ నిర్ణయం హైకమాండ్ తీసుకుంటుంది" అని శశి థరూర్ తెలిపారు.

యూడీఎఫ్ గెలిస్తే ముఖ్యమంత్రి అయ్యే అర్హత కలిగిన నాయకులు పార్టీలో చాలామంది ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.జే. కురియన్ పేర్కొన్నారు. అయితే ఆ పదవికి ముగ్గురు పేర్లను పరిశీలిస్తున్నామని, కానీ వాటిని వెల్లడించలేమని చెప్పారు. ముఖ్యమంత్రి ఎంపిక విషయంలో హైకమాండ్ తీసుకునే తుది నిర్ణయాన్ని అందరూ గౌరవిస్తారని తెలిపారు. ప్రస్తుతం కె.సి. వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది.

కేరళ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి తన సత్తా చాటింది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాల్లో 100కు పైగా నియోజకవర్గాల్లో యూడీఎఫ్ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు.

దీంతో కేరళ రాజధాని తిరువనంతపురంలోని కేపీసీసీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు మిన్నంటాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ కేక్ కట్ చేసి, సహచర నేతలకు మిఠాయిలు పంచారు. కార్యాలయం వెలుపల కార్యకర్తలు బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చాయి. సంబరాలకు సంబంధించిన వీడియోలను కె.సి. వేణుగోపాల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలాగే దేశ రాజధాని న్యూఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. దాదాపు దశాబ్దం తర్వాత కేరళలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుండటంతో నేతలు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ కేవలం 40 స్థానాల్లోనే ఆధిక్యతను చూపుతోంది.

# ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలపడం నేరం




- సెల్ఫీలు, విశ్రాంతి కోసం ఆపడం సరికాదు
- వాహనం నిలిచిపోతే 14449కు కాల్ చేయండి
- వాహనదారులకు కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్, నేటిధాత్రి:

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. ఇటీవల ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడంతో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు పలు మార్గదర్శకాలు వెల్లడించారు.

వాహనాల లోపం, వైద్య అత్యవసర పరిస్థితులు వంటి బలమైన కారణాలు ఉంటే తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి కోసం రోడ్డు పక్కన వాహనాలను నిలపడం చట్టవిరుద్ధమని, ఇది అత్యంత ప్రమాదకరమని సజ్జనార్ హెచ్చరించారు.

ఒకవేళ వాహనం మధ్యలో నిలిచిపోతే, వెంటనే 14449 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ సేవ ద్వారా అవసరమైన సహాయం అందించడంతో పాటు ఇతర వాహనదారులకు హెచ్చరికలు జారీ చేసే చర్యలు తీసుకుంటారని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని నిలపాల్సి వస్తే, వేగంగా వచ్చే వాహనాలకు ఆటంకం కలగకుండా ఎడమ వైపున ఉన్న లైన్‌లోనే నిలపాలని సూచించారు. వాహనం నిలిపినప్పుడు, వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే కనిపించేలా ప్రతిబింబించే హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

అలాగే, వాహనం నిలిచినంతసేపు ప్రమాద హెచ్చరిక దీపాలను ఆన్‌లో ఉంచడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై వాహనాల వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్ల వరకు ఉన్న నేపథ్యంలో, చిన్న నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. ఈ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని ఆయన సూచించారు.



# సిల్వర్ స్క్రీన్ టు సీఎం సీటు..

## ఎంజీఆర్, ఎన్టీఆర్, విజయ్.. పార్టీ పెట్టి చరిత్ర సృష్టించిన స్టార్స్ వీళ్లే



నేటిధాత్రి డెస్క్ :

తెలుగు నాట, తమిళ నాట సినిమా స్టార్స్‌ను ప్రేక్షకులు అభిమానించి, ఆదరించే తీరు చాలా ప్రత్యేకం. స్టార్స్‌ను కొందరు తమ ఇంటి మనుషుల్లా చూస్తారు. మరికొందరు డెమీ గాడ్స్‌గా చూస్తారు. అందుకే స్టార్స్ రాజకీయ రంగంలోనూ తమదైన ముద్ర వేస్తున్నారు. రాజకీయ పార్టీలు స్థాపించి, ఏకంగా రాష్ట్రాలకు సీఎంలు అవుతున్నారు. అది కూడా పార్టీ పెట్టిన తర్వాత తొలి ఎన్నికల్లోనే అఖండ విజయం సాధించి సీఎంలు అవుతున్నారు. తాజాగా టీవీకే పార్టీ అధినేత, సూపర్ స్టార్ విజయ్ కూడా తమిళనాడు సీఎం పదవి చేపట్టబోతున్నారు.

విజయ్ కంటే ముందు ఇద్దరు స్టార్స్ మాత్రమే ఇలా పార్టీలు స్థాపించి, మొదటి ఎన్నికల్లోనే విజయం సాధించారు. వారు ఒకరు ఎంజీఆర్. రెండోది ఎన్టీఆర్. తమిళనాడులో పెద్ద హీరోగా ఉన్న ఎంజీఆర్ (ఎంజీ రామచంద్రన్) 1972లో ఏఐఏడీఎంకే స్థాపించారు. ఆయన డీఎంకే పార్టీ నుంచి బయటకు వచ్చి తన సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత మొదటిసారి 1977లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. తమిళనాడు సీఎంగా పదవి చేపట్టారు. అంటే పార్టీ పెట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఆయన ఘన విజయం సాధించారు. ఆయన తర్వాత తెలుగు వారికి సంబంధించి అప్పట్లో ఉమ్మడి ఏపీలో సీనియర్ స్టార్ ఎన్టీఆర్ పార్టీని స్థాపించారు.

1982లో టీడీపీని స్థాపించి, 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని భారీ విజయం సాధించారు. తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే విజయం సాధించిన ఎన్టీఆర్ సీఎం పదవి చేపట్టారు. అప్పట్లో ఆయన 201 సీట్లు గెలిచారు. ఆ తర్వాత నటుడు విజయ్ ఇప్పుడు తమిళనాడులో టీవీకేను స్థాపించి, అధికారం చేపట్టబోతున్నారు. ఆయన 2024లో పార్టీని స్థాపించారు. ఆ తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలివి. ఈ ఎన్నికల్లోనే విజయం సాధించి సీఎం పదవి చేపట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఇప్పటివరకు భారతీయ సినీ పరిశ్రమకు సంబంధించి ముగ్గురు నటులు ఇలా పార్టీలు స్థాపించి, ఆ వెంటనే సీఎం పదవి చేపట్టారు.

ఈ ముగ్గురూ కాకుండా తమిళనాడులో విజయ్ కాంత్, కమల్ హాసన్, ఉమ్మడి ఏపీలో చిరంజీవి, ఏపీలో పవన్ కళ్యాణ్, కర్ణాటకలో నటుడు ఉపేంద్ర వంటి వారు పార్టీలు స్థాపించినప్పటికీ సీఎంలు కాలేకపోయారు. వీరిలో చిరంజీవి కేంద్ర మంత్రికాగా, పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు.

# తమిళనాడులో విజయ్ పార్టీ విజయం ఖాయం

- ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్
- ఆనాటి దృశ్యం సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం

న్యూఢిల్లీ, నేటిధాత్రి:

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని పార్టీ 98 నుంచి 120 స్థానాలు గెలుచుకుంటుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందుగానే జోస్యం చెప్పారు. ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ భారీ ప్రభావం చూపుతుండగా, ఆయన గెలుపు ఖాయమని అప్పుడే చెప్పిన ఆ వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. ఆ సమయంలో ఇచ్చిన ఇంటర్వ్యూ దృశ్యం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం పొందుతోంది.

'ఈ దృశ్యాన్ని దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత చూసుకోండి' అంటూ ప్రశాంత్ కిషోర్ అప్పట్లో సవాల్ విసిరారు. గత ఏడాది మార్చిలో ఆయన ఒక దూరదర్శన సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పటికి విజయ్ పార్టీ స్థాపనకు ఏడాది మాత్రమే పూర్తయింది.

విజయ్ ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగుతారని, అందులో మార్పు ఉండదని ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. అలాగే ఒంటరిగానే పోటీ చేసినా విజయ్ విజయాన్ని సాధిస్తారని, అవసరమైన మెజారిటీ స్థానాల కంటే ఎక్కువే గెలుచుకుంటారని తెలిపారు.

తమ మధ్య సంబంధంపై ప్రశ్నించగా, తాము రాజకీయ భాగస్వాములు కాకుండా మంచి మిత్రులమని ఆయన స్పష్టం చేశారు. ఐదేళ్ల క్రితం మొదటిసారి మాట్లాడుకున్నామని, తాను విజయ్‌కు ప్రత్యక్ష రాజకీయ సలహాదారు కాదని, అయితే సిద్ధాంతాలు, విలువలపై అభిప్రాయాలు పంచుకుంటూ ఉంటామని వెల్లడించారు.

# ముందుగానే అంచనా నిజం

## మా అంచనాలే నిజమయ్యాయి: ప్రదీప్ గుప్తా




న్యూఢిల్లీ, నేటిధాత్రి:

తమిళనాడులో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన విజయ్ నేతృత్వంలోని పార్టీ ప్రస్తుతం 100కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. అధికారాన్ని కొనసాగిస్తుందని భావించిన పార్టీ వెనుకబడిన పరిస్థితి కనిపిస్తోంది.

ఈ నేపథ్యంలో ప్రముఖ సర్వే సంస్థ అధిపతి ప్రదీప్ గుప్తా ఒక దూరదర్శన సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. తమ అంచనాల ప్రకారం విజయ్ పార్టీ 98కి పైగా స్థానాలు గెలుస్తుందని ముందుగానే చెప్పామని, అయితే అప్పట్లో చాలా మంది ఆ అంచనాలను విమర్శించారని తెలిపారు. ఇప్పుడు అదే అంచనాలు నిజమవుతున్నాయని అన్నారు.

ఈ విజయం తమది కాదని, గణాంక విశ్లేషణ ఫలితమని ఆయన స్పష్టం చేశారు. విజయ్ పార్టీకి యువతరం పెద్ద ఎత్తున మద్దతు పలికిందని తెలిపారు. ముఖ్యంగా 18 నుంచి 39 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓటర్లు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఈ వర్గం రాష్ట్రంలో సుమారు 42 శాతం వరకు ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా, మహిళల మద్దతు కూడా గణనీయంగా లభించినట్లు ఆయన వివరించారు. మొత్తం ఫలితాలు వెలువడిన తరువాత పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో మెజారిటీ సంఖ్యకు అవసరమైన స్థానాలను విజయ్ పార్టీ చేరుకుంటుందా లేదా అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

# మోదీ నాయకత్వానికి ప్రజల మద్దతు

## ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు నాయుడు స్పందన



అమరావతి, నేటిధాత్రి:

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా సీఎం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు.

'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతి వర్గానికీ అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో ముందుకు సాగుతున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఉద్ఘాటించారు.

# రూ.లక్షా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ జూనియర్ అసిస్టెంట్



హైదరాబాద్ , నేటిధాత్రి:

ఇంటి నిర్మాణానికి ( అవసరమయ్యే అనుమతుల కోసం లంచం డిమాండ్ చేసిన జూనియన్ అసిస్టెంట్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బోరబండ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి శ్రీలత సోమవారం బాధితుడి నుంచి రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

ఇంటి నిర్మాణానికి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకునే దశ నుంచి దానిని ప్రాసెస్ చేసి, గృహ నిర్మాణ అనుమతిని అందజేసే దశ వరకు జూనియర్ అసిస్టెంట్ మొత్తం రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా తొలి విడతగా యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద రూ.లక్షా తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడినందుకు ఆమెపై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.




# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు

- కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి
- 8న చౌదరిగూడెం వద్ద పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ
- పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు




హైదరాబాద్ , నేటిధాత్రి:

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి, ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై "జనంబాట" కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

"పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" పోస్టర్ ఆవిష్కరణ

పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాకు నీళు ఇచ్చే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సహా మూడు ప్యాకేజీల పనులను 11 ఏళ్ల తర్వాత కూడా ప్రారంభించకపోవడంపై ఉద్యమానికి కవిత శ్రీకారం చుట్టారు. ఈనెల 8న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరి గూడెం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీగా ముక్కెర సురేష్



**నడికూడ, నేటిధాత్రి:** పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు,కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన ముక్కెర సురేష్ ను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రేవురికి,వరంగల్ జిల్లా అధ్యక్షులు ఇనుగాల కి అలాగే పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులకు ఈ బాధ్యత నాపై ఉంచిన నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని రాస్తారోకో

## తెలంగాణ రైతు సంఘం ఏ ఐ కె ఎస్



**కేసముద్రం, నేటిధాత్రి:** కేసముద్రం మండలం తాళ్లపసపల్లి గ్రామం లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మార్తినేని పాపారావు. రైతు సంఘం మండల అధ్యక్షుడు నీరుటిజలంధర్ రైతుల సమస్యలు తెలుసుకుని రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించడం జరిగింది. తాళ్లపూసపెళ్ళిలో 15 రోజుల క్రితం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించారు, మొక్కజొన్నలు నింపడానికి 10వేల బస్తాలు ప్రభుత్వం పంపిణీ చేసిందని, వాటిని మాత్రమే కాంటాలు పెట్టారని ఆరు లారీల్లో 6300 బస్తాలు తరలించారని ఈరోజు లారీల్లో వారు 2000 బస్తాలు తరలిస్తారని ఇక్కడ నిర్వాహకులు చెప్పారని, 20 రోజుల క్రితం మొక్కజొన్నలు తీసుకువచ్చి రాశులు పోసామని కాళీ బస్తాలుఇవ్వలేదు, మీరే కొనుక్కోచుకోమంటే తెచ్చుకుందామని అయినా బస్తాల్లో నింపట్లేదని అడుగుతే ఆన్లైన్ అయితే నింపుతం అంటున్నారని, 15 రోజుల్లో నుండి ఇక్కడ కావాలి పడుకో లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు తమ ఆవేదన తెలియజేశారని, నిన్న గాలి దుమారం అకాల వర్షానికి ఇబ్బంది పడ్డామని త్వరగా బస్తాలు అందించి కంటాలు పెట్టించి లారీలు తీసుకొచ్చి తరలించాలని రైతులు వారి ఆవేదన తెలియజేయడం జరిగింది. రైతులకు మద్దతుగా కొనుగోలు కేంద్రం ఎదురుగా ఉన్న కేసముద్రం మహబూబాద్ ప్రధాన రహదారిపై బైటాయించి ఆందోళన చేయడం జరిగింది, ఇంకా కొనుగోలు కేంద్రంలో 30 వేల బస్తాలు కాంటాలు పెట్టి తరలించాల్సి ఉందని, ఈ కొనుగోలు కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఇంకా రైతుల కళ్ళల్లో మొక్కజొన్నలు ఉన్నాయని త్వరగా తరలించాలని రాస్తారోకో చేయడం జరిగిందని . రేపు కలెక్టర్ ని కలిసి మొక్కజొన్న,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొనే ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో, ఈ కార్యక్రమంలో మాదా శ్రీనివాస్, కాలేరు రామ్మూర్తి, మేకల మురళి బానోత్ కిషన్, కాలేరు వెంకటమ్మ భాదవత్ రమేష్ రాములు నాయక్, మోక్ష వెంకటేష్, సారయ్య, వెంకన్న,నర్సయ్య, పీరియా రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టులో ఉద్యోగాల పేరుట కాంట్రాక్టర్ డబ్బులు వసూలు దందా

## న్యాయస్థానాలలో అక్రమ వసుల దండ



**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టులో కాంట్రాక్టర్ కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకునే పోస్టులకు స్లీపర్ ఎలక్ట్రిషన్ ప్లంబర్ పెయింటర్ గార్డెన్ క్లీనింగ్ తదితర పోస్టులకు కాంట్రాక్టర్ నరేష్ వారి బినామీగా కార్తీక్ ని అడ్డం పెట్టుకుని అతని నుంచి డబ్బులు వసూలు చేసుకుంటూ ఉద్యోగాల నమ్ముకుంటూ పోస్టుకు లక్ష యాభై నుంచి రెండు లక్షల వరకు తీసుకుంటూ అమాయక ప్రజల్ని బుట్టలో పడేస్తూ పద్ధతి కొనసాగిస్తున్నాడు ఇంత జరుగుతున్నా ఇది ఎక్కడో కాదు జిల్లా కోర్టులో నిరంతరం న్యాయం కోసం వస్తున్న ప్రజలు ఎక్కడైతే న్యాయం జరుగుతుందనుకుంటున్నారో అదే కోర్టు దగ్గర ఎంతోమంది అమాయకులను మోసం చేసే విధంగా కాంట్రాక్టు మాయ మాటలు చెప్పి ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తూనారు ఇది చాలా రోజుల నుంచి జరుగుతున్న ఎవరి దృష్టిలో పడకుండా జాగ్రత్తగా కొనసాగిస్తున్నాడు ఒక కోర్టులోనే పైసల దందా చేస్తూ కాంట్రాక్టు ఉద్యోగాలను అమ్మకాలకు పెడుతూ ఈ రకంగా ఆయన దందా కొనసాగిస్తున్నారు ఇంతకుముందే భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీస్ లో జరిగినటువంటి అవినీతిని ఇక్కడ ఉన్నటువంటి ఎమ్మెల్యే ఏ విధంగా అయితే కాంట్రాక్టు పై చర్యలు తీసుకొని కాంట్రాక్టర్ రద్దుచేసి కొత్త కాంట్రాక్టు అప్పచెప్పారో అదేవిధంగా కోర్టులో జరుగుతున్నటువంటి అక్రమాన్ని ఈ డబ్బులు వసూలు దందా అని ఆపి సామాన్యమైన ఎలిజిబులిటీ అయిన నిరుపేదలకు నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని ఏదైతే డబ్బులు తీసుకుంటున్నారో దాన్ని నియంత్రించాలని ఇక్కడున్నటువంటి జిల్లా కలెక్టర్ కి తెలియజేయడం జరుగుతుంది ప్రజల దగ్గర డబ్బులు తీసుకుంటూ ఎవరితో చెప్పకూడదని కాంట్రాక్టు వారితో చెప్పుకుంటూ డబ్బులు తీసుకుంటూ వారిని ఉద్యోగాలలో కొనసాగిస్తున్నాడు ఎవరైతే డబ్బులు కట్టి నష్టపోయారో వారికీ న్యాయం చెయ్యాలని జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని బట్టు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు

# ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ శ్రీకాంత్




**భూపాలపల్లి, నేటిధాత్రి:** భూపాలపల్లి రూరల్ మండలం కొంపల్లి గ్రామంలో ఉపాధి హామీ 100 రోజుల పనిని కొంపల్లి గ్రామ సర్పంచ్ సదాల శ్రీకాంత్.. ఉప సర్పంచ్ మర్రి శ్రీనివాస్ ఉపాధి హామీ పని ప్రారంభించి అనంతరం కూలీలకి మజ్జిగా..పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి లింగయ్య ఫీల్డ్ అసిస్టెంట్ బొల్లవేణి శ్రీనివాస్ యాదవ్ కొంపల్లి తండా సర్పంచ్ అజ్మీరా నిర్మలా సతీష్ ఉపసర్పంచ్ వాలు నాయక్... తదితరులు పాల్గొన్నారు

# శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఆహ్వాన పత్రిక ఐ టీ శాఖ మంత్రికి అందజేసిన అడవి శ్రీరాంపూర్ గౌడ సంఘ నాయకులు




**ముత్తారం, నేటిధాత్రి:** ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ జమదగ్ని ముని సమేత శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి యంత్ర ప్రతిష్టాపన మే 9 వ తారీకు శనివారం రోజున జరుపబడును ఇట్టి కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హైదరాబాదులోని మంత్రి నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేసి ప్రతిష్టాపనకు రావలసిందిగా కోరారు ఈ కార్యక్రమంలో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తో పాటు గౌడ సంఘం నాయకులు కూనూరి. సత్యనారాయణ గౌడ్, గట్టు సదయ్య గౌడ్, వీరగోని సంతోష్ గౌడ్, బండి క్రాంతి కుమార్ గౌడ్ మరియు వార్డు సభ్యులు వీరగోని అంజి గౌడ్. అడవి శ్రీరాంపూర్ గౌడ సంఘం తరపున ఆహ్వాన పత్రిక అందచేశారు ఈ సందర్భంగా దేవాలయం ఆవరణలో సెంట్రల్ లైట్స్ మంత్రి మంజూరు చేయడం జరిగింది. అడవి శ్రీరాంపూర్ గ్రామ గౌడ సంఘం తరఫున మంత్రి కి కృతజ్ఞతలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

# ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** అలనాటి జ్ఞాపకాలను మదిలో పెట్టుకొని ఆప్యాయతను పంచుకోవడానికి ఒక వేదికను ఏర్పాటు చేసుకున్నారు రామకృష్ణాపూర్ ప్రభుత్వ బాల బాలికల పాఠశాలలో 2001-2002 సంవత్సరంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీమా గార్డెన్ విద్యార్థులకు వేదికగా మారింది. 24 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంతో స్నేహ బంధాన్ని పెంపొందించుకున్నారు ఆనాటి విద్యార్థులు. ముందుగా విద్య నేర్పిన గురువులకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించుకున్నారు. గురువులు చెప్పిన మాటలు శ్రద్ధగా వింటూ విద్యార్థులు లాగా మారి సంతోషంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు పలకరించుకుంటూ సందడి చేశారు. తిరిగిరాని మధుర క్షణాలను గుర్తుచేసుకొని బావోద్వేగానికి గురయ్యారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆపదలో ఉన్న తోటి మిత్రులకు తోడ్పాటును ఇవ్వాలని ఆనాటి విద్యార్థులందరూ నిర్ణయించుకున్నారు. పాఠాలు నేర్చుకున్న తమ విద్యార్థులు పలు రంగాలలో స్థిరపడటం గర్వంగా ఉందన్నారు ఉపాధ్యాయులు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేసిన నూక సురేష్ కుమార్



**పరకాల, నేటిధాత్రి:** పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ లో సాయి గీతా కిరాణం యజమాని నూక సురేష్ కుమార్ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు దాహార్తి తీర్చాలనే కోరికతో ఏప్రిల్ నెల ప్రారంభం నుండి నేటి వరకు అంగడి బజార్ నుండి వెళ్లే ప్రజలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారు.ప్రతిరోజు అంగడి బజార్ కు వెళ్లే ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరుగుతున్నది దంచి కొడుతున్న ఎండలను చూసి ప్రజల పై ప్రేమతో మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేస్తున్న సాయి గీత కిరాణం యజమాని సురేష్ కుమార్ ను పలువురు అభినందిస్తూ దీవిస్తున్నారు.ఒకవైపు పక్క వారికే సహాయం చేయని ఈ రోజులలో మండుతున్న ఎండలను చూసి సాయి గీతా కిరాణం యజమాని అంగడి బజార్ నుండి వెళ్లే ప్రతి ఒక్కరికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం చాలా గొప్ప గర్వకారణమని కొనియాడుతున్నారు.

# వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నేలల సంరక్షణ ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం....



**తంగళ్ళపల్లి, నేటిధాత్రి:** తంగళ్ళపల్లి మండలం తాడూరు గ్రామంలో రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జయ జయహే తెలంగాణ పాటను వినిపిస్తూ నేలల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమఅగ్రవాల్. ఈ సందర్భంగా మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి మార్చి ఆరవ తేదీన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల ప్రారంభించారని గుర్తు చేస్తూ. ఇందులో భాగంగా జూన్ 12.వ. తేదీ. వరకు .10. శాఖల .ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని. గ్రామ.పంచాయతీల మున్సిపాలిటీలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు. చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్ష లు సేవలు అందించామని. ఆరైవ్. అలైవ్. కింద వాహనదారులకు ట్రాఫిక్ నియమాల నిబంధనలపై అవగాహన కల్పించామని. డ్రైవర్లకు వైద్య పరీక్షలు కంటి పరీక్షలు చేయించామని. అంగన్వాడి కేంద్రాల్లో ప్రతినెల పిల్లల ఎత్తు బరువు కొలుస్తారని ఎదుగుదల లోపించిన పిల్లలకు ప్రత్యేక వైద్యం పోషకాహారం అందిస్తారని. మూడేళ్ల వయసు అలాగే ఆరేళ్లలోపు పిల్లలు తమ సమీపంలోని



అంగన్వాడి కేంద్రంలో నమోదు కావాలని పోషకాహారం ఇతర సేవలు సద్వినియోగం చేసుకోవాలని. ఈనెల నాలుగో తేదీ నుంచి 9.వ తేదీ. వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని. అలాగే సన్న వడ్లు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు సాగులోయజమాన్య పద్ధతులు ఎరువులు వినియోగం దిగుబడి సన్నవడ్లకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ తదితర అంశాలపై వివరిస్తూ. నేలలు అన్నీ పోషకాలతో ఉండవని. ఒక నెలలో ఒక్కో విధమైన పోషకాలు ఉంటాయని. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించాలని. దీంతో భూసార వివరాలు వస్తాయని. దానికి అనుగుణంగా నేలలో. ఏ పంట వేయాలి ఏ ఏ ఎరువులు. పురుగు మందులు ఎంత మోతాదులో వియోగించాలో తెలుస్తుందని. ఇష్టరీతిన ఎరువులు. పురుగుమందులు వాడటంతో నేల నిస్సారశీ. అవుతుందని. ఈస్టారితీయిన ఎరువులు పురుగు మందులు వాడిన పంట ఉత్పత్తులు వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు కచ్చితంగా శాస్త్రవేత్తల వ్యవసాయ అధికారుల సూచన మేరకు సాగు చేయాలని సూచిస్తూ. రేషన్ దుకాణాలు రెసిడెన్షియల్ విద్యాలయాలు ప్రభుత్వ పాఠశాలలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని. అందరూ సన్నబియ్యం వినియోగిస్తున్నారని. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు సాగు చేసే రైతులకు బోనస్ అందిస్తుందని. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సన్న వడ్లు సాగుచేయాలని పిలుపునిచ్చారు. అధిక దిగుబడులు ఉన్న ఆయిల్ ఫామ్.ను రైతులు సాగు చేయాలని. మొక్కలు. డ్రిప్ ఇరిగేషన్. అంతర. పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రారంభించారని గుర్తుచేస్తూ రైతులు ఆయిల్ ఫామ్.సాగు చేయాలని పిలుపునిచ్చారు. అలాగే నేలల సంరక్షణ ఎరువుల వినియోగం కీలకమని రైతు వారోత్సవాల సందర్భంగా నేలల సంరక్షణ ఎరువుల యజమాన్యం ప్రకృతి వ్యవసాయం సన్న వడ్లు ఆయిల్ పంప్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగమ్ గౌడ్. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్. డిపిఓ. షర్ఫుద్దీన్. వ్యవసాయ శాఖ కళాశాలల.ప్రొఫెసర్లు వివిధ గ్రామాల సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కేసముద్రం, నేటిధాత్రి:** తాళ్లపూసపల్లి గ్రామంలో బత్యేం సమ్మయ్య అనే రైతు యొక్కమూడు పశువులు నిన్న ఆదివారం పిడుగుపాటుతో మృతి చెందటంతో సోమవారం మహబూబాబాద్ మాజీ శాసన సభ్యులు బానోత్ శంకర్ నాయక్, పరామర్శించి 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది మొక్కజొన్న కొనుగోలు కేంద్రం దగ్గరకు వెళ్లి కాంటాలు కాకపోవడం గురించి



బస్తాలు లేకపోవడం గురించి లారీలు రాకపోవడం గురించి సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, గ్రామ సర్పంచ్ కందుకూరు ఉప్పలయ్య, ఉప సర్పంచ్ బందారు యాకన్న దేవేంద్ర, మాజీ సర్పంచ్ పోతకం సుధాకర్, బండి శ్రీనివాస్ , వాలేరు దశరథం, గొట్టిపర్తి వెంకన్న, వల్లాల కొమురయ్య ఆరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం




## గాదె ప్రభాకర్ రెడ్డి విమర్శ

**పరకాల, నేటిధాత్రి:** రైతులు పండించిన మొక్కజొన్న,వరి కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి విమర్శించారు.పరకాల వ్యవసాయ మార్కెట్లో రైతులతో కలిసి సమస్యలను పరిశీలించిన ఆయన,సంబంధిత అధికారులతో చర్చించారు.కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,20 రోజులుగా పంటలు కొనకుండా రైతులను నిరీక్షింపజేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వం తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్ల చక్రపాణి,రాగుల రమేష్, పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్,బొచ్చు ఈశ్వర్,మడికొండ ప్రశాంత్,రవి,సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# 10టీవీ రిపోర్టర్ పొనగంటి స్వామి రావుకు ఘన సన్మానం



## హనుమాన్ మాల దీక్ష స్వాముల ఆధ్వర్యంలో వరల్డ్ ప్రెస్ దినోత్సవం వేడుకలు

**నర్సంపేట, నేటిధాత్రి:** వరల్డ్ ప్రెస్ దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామంలో హనుమాన్ మాల దీక్ష స్వాముల ఆధ్వర్యంలో జర్నలిస్టు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, 10టీవీ నర్సంపేట విలేకరి పొనగంటి స్వామి రావును పూలమాల వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం జర్నలిస్ట్ గురుస్వాములు అందేశ్వర స్వామి, కోల ప్రవీణ్ స్వామి సమక్షంలో నిర్వహించగా మాజీ సర్పంచ్, గురుస్వామి ఆలకుంట సురేందర్ మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాలుగా జర్నలిజాన్నే ధ్యేయంగా సమాజంలో సేవ చేయాలనే తపనతో మండల స్థాయి విలేకరి నుంచి జిల్లా స్థాయి విలేకరిగా అంచెలంచెలుగా ఎదిగిన సీనియర్ జర్నలిస్టు పొనగంటి స్వామి అని కొనియాడారు. సమాజ సేవలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్తా సేకరణ చేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్నారని, ఆయనకు జర్నలిస్టు దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దొరికిన రమేష్, చీపురు మల్లయ్య, ప్రశాంత్, సూర్యప్రకాష్, మూడు ప్రేమాకర్, సిద్ధు, అనిల్, దుర్గయ్య, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రైతు వారోత్సవాలు సదస్సు



**గుండాల, నేటిధాత్రి:** ప్రజా పాలన పగతి ప్రణాళికలో భాగముగా గుండాల రైతు వేదికలో రైతువారోత్సవములు కార్య క్రమమును గుండాల సర్పంచ్ కొరం సీతారాములు పారంభించారు. నేల అరోగ్యము సమతుల్య ఎరువుల యాజమాన్యం అనే అంశముపై గుండాల వ్యవసాయ అధికారి సిహెచ్ వెంకటరణ అవగాహన సదస్సును గుండాల రైతు వేదిక లో నిర్వహించారు. ఈ కార్యక్రమము యందు రైతులకు నేల ఆరోగ్యం కార్డు యొక్క అవశ్యకత, భూసార పరీక్ష కోసం మట్టి సమునాలు సేకరణ, పానము విధానము భూసార పరీక్షల అచారముగా ఎన్ పీకే సుక్ష్మ పోషకాల స్థాయి, పంటలకు సరైన ఎరువుల సుచనలు వివరించారు.సమగ్ర పోషక నిర్వహణ కోసం రసాయన ఎరువులు, సెంద్రియ ఎరువులు, బయో ఎరువులు సభుతుర్చిం వినియోగం, నెల సారం పెంపు పై వివరించారు.నానో యూరియ వినియోగము, నానో యూరియ అవశ్యకత తక్కువ మోతదులో ఎక్కువ ప్రయోజనం గురించి వివరించారు.సన్నరకం వడ్లు సాగు చేయడం వలన క్వింటలుకు 500 ల బోనస్ ను రైతులకు కల్పించారు.రైతులకు, (క్రాప్ బుకింగ్ పంట వివరముల ఫార్మర్ ఫర్టిలైజర్ అప్ లో రిజిస్టరీ రైతు వివరముల నమోను) మరియు క్విడటే బుకింగ్ విదానము మొదలగు అంశెములపై రైతులకు వివరించారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డ్స్ భూసార పరీక్షా విశ్లేషణ రైతులకు పంపిణీ చేయుట జరిగింది. ఈ కార్యక్రమములో గుండాల మండల వ్యవసాయాదికారి, సిహెచ్ వెంకటరణ, ఏఈఓ లెనిన్, ఎం రవికుమార్ పాల్గోన్నారు.

# పదవితో బాధ్యతలు మరింత పెరిగాయి

▶▶ఎమ్మెల్యే,డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక కృతజ్ఞతలు.....

▶▶బుర్ర దేవేందర్ గౌడ్...



**నడికూడ, నేటిధాత్రి:** జిల్లా కాంగ్రెస్ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై డీసీసీ ప్రధాన కార్యదర్శి బుర్ర దేవేందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకటరామిరెడ్డి,పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తుందని పేర్కొన్నారు.పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పనిచేసిన వారిని ప్రోత్సహించే సంప్రదాయం కాంగ్రెస్‌కే సాధ్యమని అన్నారు.తనకు అప్పగించిన ఈ బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని స్పష్టం చేశారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ వేదికగా నిరంతరం పోరాడతానని తెలిపారు. పార్టీ ఆశయాలు,సంక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు.తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్క నాయకుడు,కార్యకర్తకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఎల్లప్పుడూ తనకు అండగా నిలిచారని,వారి సహకారంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అందరిని కలుపుకొని పార్టీ విజయానికి కృషి చేస్తానని బుర్ర దేవేందర్ గౌడ్ తెలిపారు.

# అనుమతులు లేని గోవదశాలలు మూసివేయాలి



**మంచిర్యాల, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గోమాతను అక్రమ రవాణా చేస్తూ అనుమతులు లేని గోవదశాలలు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కఠిన మైన చర్యలు తీసుకోవాలని సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కి వినపత్రం అందించారు.మంచిర్యాల లో ఎన్ని గోవద శాలలు ఉన్నాయో వాటికీ అనుమతులు ఉన్నాయా లేదా అని లెక్క తీర్చాలని అన్నారు.అనుమతులు లేని గోవదశాలలను వెంటనే మూసివేయాలని,ఇప్పటికైనా అధికారులు అందించాలని , లేనిపక్షంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఎక్కడైతే గోవద చేస్తున్నారో అన్ని ఆధారాల తో మేమే స్వయంగా ఆట్టి వారిని అడ్డుకొని దాడులు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లో నాచురల్ ఎనిమల్ ట్రస్ట్ సభ్యులు,వేముల హరిప్రసాద్,కర్ణకంటి రవీందర్,విశ్వహిందూ పరిషత్ నాయకులు నస్పూరి సాగర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బెంగాల్అస్సాం పుదుచ్చేరిలో బీజేపీ ఘన విజయం



**సిద్దిపేట, నేటిధాత్రి:** సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు అనుముల సంపత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో బాలసంచ పేల్చి మిఠాయిలు పంచుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షులు మరియు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు , సీనియర్ నాయకులు హాజరయ్యారు

# పోలీసులంటే కర్కశత్వం కాదు.. మానవత్వం ప్రదర్శన

▶▶బాలానగర్ ఎస్సై లెనిన్ పై.. ప్రశంసలు



**బాలానగర్, నేటిధాత్రి:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం బాలానగర్ మండల కేంద్రంలో మానవత్వం మళ్ళీ పరిమళించింది. స్థానిక ఎస్బీఐ బ్యాంకు ముందు చిన్న రేవల్లి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి (60) గుండెపోటుకు గురై అక్కడి బెంచ్‌పై అవస్మారక స్థితిలో వడిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై లెనిన్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సమయస్ఫూర్తితో సిపిఆర్ నిర్వహించారు. అనంతరం కానిస్టేబుకు రాము, రఘుతో కలిసి ఎల్లారెడ్డిని తన చేతులతో ఎత్తుకొని అంబులెన్స్‌లోకి చేర్చి, షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా మోతీ ఘనపూర్ గ్రామంలో ఓ అనాధ శవానికి సొంత డబ్బులు ఖర్చు పెట్టి అంత్యక్రియలు నిర్వహించి ప్రశంసలు పొందారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులు ఎండలో నిరీక్షించకుండా.. నీడలో ఉండేటట్లు నూతనంగా రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. పోలీసులంటే కర్కశత్వం కాదని.. సహాయం చేసే మంచి మనసున్న వారని ఏలాంటి ఘటనలు జరిగిన.. వెంటనే స్పందించి ప్రాణరక్షణకు కృషి చేసిన ఎస్సై లెనిన్ చర్యలను స్థానికులు ప్రశంసిస్తూ.. ఆయన మానవత్వాన్ని చాటారని అభినందించారు.

# మాజీ ఎమ్మెల్యే గండ్ర రమణ అన్న జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి

▶▶బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మోతే కర్ణాకర్ రెడ్డి



**గణపురం, నేటిధాత్రి:** గణపురం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి నేటి దాత్రితో మాట్లాడుతూ మంగళవారం ఉదయం: 9:00 గంటలకు భూపాలపల్లి అభివృద్ధి ప్రదాత, మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదినం సందర్భంగా గణపురం మండల కేంద్రంలో కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేయడం జరుగుతుంది.కావున వివిధ గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, మాజీ ఎంపిటిసిలు, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ఉపాధ్యక్షులు, సోషల్ మీడియా నాయకులు,యూత్ నాయకులు,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,పాల్గొనవలసిందిగా మనవి

# రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు యాసంగి వరి ధాన్యము కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన





కార్య దర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించగా.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్టంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పలిన్ కవర్లు, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియ జేయలన్నారు. కొనుగోలు కేంద్రాలలో తాగు నీరు, షామియానా, ఓఆర్ఎస్, ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తేమ శాతం చూసే యంత్రాలు ఆటో మేటిక్ ప్యాడి క్లెనర్ లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. ఎక్కడా జాప్యం చేయకూడని స్పష్టం చేశారు. హమాలీలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలను గ్రామ స్థాయి, మండల స్థాయి అధికారులు నిత్యం పరిశీలించాలని ఆదేశించారు. ఈ నెల ఆఖరు వరకు 80 శాతం ధాన్యము కొనుగోలు పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి గీత, జిల్లా సహకార శాఖ అధికారి రామక్రిష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన మైనారిటీ విద్యార్థుల కు సన్మానం



**మంచిర్యాల, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లాలో ని మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్స్ ల లో 10వ తరగతి,ఇంటర్ ల లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంచిర్యాల కలెక్టరెట్ లో మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ పి. చెంద్రయ్య సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు కల్పించే ఈ అవకాశాలు వినియోగించు కుని,ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధికారి నీరటి రాజేశ్వరి,ఆర్ ఎల్ సి (ఆసిఫాబాద్,మంచిర్యాల జిల్లాలు )షాగుప్త ఫిర్దోస్, అకాడమిక్ కోర్డినేటర్ ఎండీ. రిజ్వాన్,విజిలెన్స్ ఆఫీసర్ ఎండీ. తాహేరుద్దీన్,చెన్నూర్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.గోపి,జూనియర్ కాలెజ్ ప్రిన్సిపాల్ బి.సమ్మయ్య,బెల్లంపల్లి ప్రిన్సిపాల్ ఎండీ .నీలు పాల్గొన్నారు.

# రహదారి విస్తరణ బాధితులు ఆందోళన చెందవద్దు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టిన రహదారి విస్తరణలో ఇండ్లు కోల్పోయిన బాధితులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం 55 అడుగుల విస్తీర్ణంతో రహదారి నిర్మాణం చేపట్టడం జరిగిందని,నష్టపోయిన ఇండ్ల యజమానులు ఆందోళన చెందొద్దని తెలిపారు.నష్టపోయిన దుకాణ బాధితులకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మించే కమర్షియల్ కాంప్లెక్స్ లో మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఇతర ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు మున్సిపల్ కార్యాలయం నుండి అందిన నోటీసులో పొందుపరచబడిన ధ్రువపత్రాలను సమర్పించినట్లయితే టి.డి.ఆర్.లో రాష్ట్రం లో ఎక్కడైన వెసులుబాటుహొకల్పించడం జరుగుతుందని తెలిపారు.దశల వారీగా రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని,రహదారి విస్తరణ ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తొలుగుతాయని, అత్యవసర సేవలు సులభతరం అవుతాయని తెలిపారు.సంబంధిత అధికారులు ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ పారదర్శకంగా పనులు చేపట్టాలని,రహదారి విస్తరణలో ప్రజలు,వ్యాపారస్తులు అధికారులకు సహకరించాలని తెలిపారు.

# రేణుక ఎల్లమ్మ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎస్సార్.



**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల మండల కేంద్రం లో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ 5వ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గౌడ కులస్తులు ర్యాలీగా వెళ్లి ఆ తల్లికి మొక్కులు చెల్లించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి పాడిపంటలు బాగుండాలని అందరూ గౌడ కులస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆ తల్లిని వేడుకోవడం జరిగిందిలి ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుట్ల తిరుపతి గ్రంధాలయ చైర్మన్ కోట రాజబాబు జిల్లా అధికార ప్రతినిధి డైరెక్టర్ దొడ్డి కిష్టయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ గౌడ్ మరియు భూపాలపల్లి జయశంకర్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ వివిధ గౌడ సంఘాల జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారులి లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానించి వారిని శాలువలతో సన్మానించడం జరిగింది. అనంతరం స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మి, అంతయ్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది వారికి కూడా గౌడ సంఘం నుండి ప్రత్యేక కృతజ్ఞతలు బుర్ర లక్ష్మణ్ గౌడ్ తెలియజేశారులి కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల రాజు, డైరెక్టర్లు గుర్రపు రాజు బుర్ర రాజకుమార్ ఆముదాల పెల్లి శ్రీనివాస్ బుర్ర నరేష్ గౌడ సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు

# బిజెపి ప్రభంజనం బిజెపినే దేశానికి శ్రీరామరక్ష:

బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ చింతకింది



**మొగులపల్లి, నేటిదాత్రి:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అసోంలో అద్భుతమైన ఫలితాలు సాధించి ప్రభుత్వ ఏర్పాటు దిశగా ముందడుగు వేస్తున్న సందర్భంగా నాయకులకు, కార్యకర్తలకు బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల్లో బిజెపికి రోజురోజుకు ఆదరణ పెరుగుతుందనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. ఈ దేశాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న మోడీ గారి పాలనలోనే దేశం సురక్షితంగా ఉంటుందని, దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా ఇవే ఫలితాలు భవిష్యత్తులో కూడా వస్తాయని సురేష్ ఆశ భావం వ్యక్తం చేశారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, మహిళలు అందరూ భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని బలపరుస్తున్నందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు..

# ఘనంగా బిజెపి విజయోత్సవ సంబరాలు



**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఈ రోజు భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ శాఖ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వెస్ట్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఘన విజయాన్ని పురస్కరించుకొని విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతూ బిజెపికి అపూర్వ విజయాన్ని అందించారని అన్నారు. అస్సాం మరియు పుదుచ్చేరిలో తిరిగి విజయం సాధించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని, అభివృద్ధి మరియు పారదర్శక పాలన పట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని తెలిపారు. అలాగే వెస్ట్ బెంగాల్‌లో బిజెపి మొదటిసారిగా అధికారం చేపట్టడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పార్టీ ప్రభావం రోజురోజుకూ విస్తరిస్తోందని, ఇది ప్రజల మార్పు సంకల్పానికి ప్రతీక అని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బిజెపి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి రహిత, ప్రజా సంక్షేమ పాలనను అందించడమే బిజెపి లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి మైనార్టీ మోర్చా అధ్యక్షులు వాజిద్ హుస్సేన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాంప్రసాద్ పట్టణ ఉపాధ్యక్షులు పల్లికొండ నరసయ్య పట్టణ ప్రధాన కార్యదర్శిలు మెరుగు శ్రీనివాస్ కొండ నరేష్ పట్టణ అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్ పట్టణ కార్యదర్శిలు సూరం వినయ్ దూడం సురేష్ సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు మామిడాల మహేష్ బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మిఠాయిలు పంచుకుంటూ, పటాకులు కాలుస్తూ ఆనందోత్సాహాలతో సంబరాలు తీసుకోవడం జరిగింది

# ముగిసిన శ్రీ మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్సవాలు



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండల కేంద్రం లోని అతి పురాతన శ్రీ మత్స్యగిరి స్వామి బ్రహ్మోత్స వాలు వైభవంగా ముగిసాయి. ఆదివారం రాత్రి ఆలయంలో స్వామివారి నాగవల్లి కార్యక్ర మాన్ని అత్యకులు కృష్ణమా చార్యులు వైభవంగా జరిపిం చారు. గత నెల 29 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. మచ్చర్లయ్య గుట్టకు భారీగా భక్తులు హాజరై స్వయంగా తెలిసిన స్వామివారిని దర్శనం చేసుకుని మొక్కలు చెల్లించుకున్నారు. స్వామివా రికి విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, ద్వాదశ ఆరాధనలు, పుష్పయాగాన్ని అర్చకులు జరిపించారు. శ్రీ మత్స్యగిరి స్వామి శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో అలంకరించి ఆల యం చుట్టూ ఊరేగించారు. అనంతరం దేవాలయ చైర్మెన్ సామల బిక్షపతి పండిత సన్మానం చేసి కల్యాణోత్సావా లు ముగిసాయి ఈ కార్యక్ర మంలో సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, కుసుమ వెంకట కృష్ణ, సామల రవీందర్, భక్తు ల అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

# రైతు వారోత్సవాలను ప్రారంభించిన రైతు కమిషన్ వైస్ చైర్మన్ మర్కంటి భవాని



**కొండపాక, నేటిదాత్రి:** ప్రజా పాలన ప్రగతి నివేదిక లో భాగంగా రైతు వారోత్సవాలను సోమవారం రోజు దుద్దెడ రైతు వేదికలో ప్రారంభించడం జరిగింది. దానిలో వారు మాట్లాడుతూ రైతులు సహజ వ్యవసాయం వైపు మరలాలని, మార్కెట్ ఆధారిత పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం తొరణాల నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం మరియు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్ణయించబడిన వరి రకాలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని మరియు జీలుగ జనుము విత్తనాలు రైతులకు సకాలంలో అందజేస్తామని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సువర్ణ మాట్లాడుతూ రైతులు క్రాప్ డైవర్సిఫికేషన్ చేసుకోవాలని ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు ప్రాధాన్యమిస్తుందని ఆయిల్ ఫాం సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులకి భూసార పరీక్ష ఫలితాల కార్డులను అందజేయడం జరిగింది. రైతులు పొలంలో మట్టి పరీక్షల కోసం మట్టి నమూనాలను ఎలా సేకరించాలో రైతులకు డిమానిస్ట్రేషన్ ద్వారా చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ,జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ,వివిధ గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, ఐ ఎఫ్ ఎఫ్ సి ఓ డిస్టిక్ మేనేజర్, మండల వ్యవసాయ అధికారి మరియు ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం



పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం
2004-2026

"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్పూర్తిగా కోరుకుంటూ....

22th ANNIVERSARY 2004-2025
వసంతాల అక్షరోద్యమం



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# ఆరోగ్య ధాత్రి

## ఈ పండు ఎప్పుడైనా తిన్నారా.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?

సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

## వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా%ొ% శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%ొ% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

## ఐదు విటమిన్లు తప్పనిసరి!

ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.



విటమిన్ డి3

దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12

ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.

### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.

## సత్తువ పిండి



మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా

శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

## ఇద్దరిలో ఒకరు ఎందుకలా

హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు

కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.



అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్‌ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

## గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

వాముజి,అవిసె గింజలు

## పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.



# స్టార్ నుంచి సీఎం...!

# జన నాయగన్

## ద్రావిడ కోటలపై దళపతి దాడి.. తమిళ రాజకీయాల్లో తుఫాను!

### స్టార్ నుంచి సీఎం దాకా విజయ్ జైత్రయాత్ర.. 49 ఏళ్ల చరిత్రకు కొత్త మలుపు!

## టీవీకే సునామీ.. డీఎంకే, అన్నాడీఎంకేలకు భారీ షాక్!

- విజయ్ ఇంటి వద్ద పోలీసు బలగాల మోహరింపు
- విజయోత్సవాల్లో విజిల్స్ ఊదిన కుటుంబ సభ్యులు

- దళపతి దెబ్బకు ద్రావిడ కోటల కూల్చివేత
- విజయ్ సునామీకి పాత రాజకీయాల ఊచకోత
- స్టార్ పవర్‌కు ప్రజల ముద్ర
- టీవీకే తుఫాన్.. అధికార ద్వారం బద్దలు
- ఒక్క దెబ్బతో రాజకీయ పటం మార్పు

చెన్నై, నేటిధాత్రి:
తమిళనాడు రాజకీయ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ప్రజలు ఈసారి స్పష్టమైన తీర్పు ఇచ్చారు. దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలకు గట్టి గుద్దు కొడుతూ, సినీ నటుడు దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళధాత్రి:`గ వెత్రి కళగం (టీవీకే) అప్రతిహతంగా దూసుకుపోతోంది. తాజా ఫలితాల ధోరణిలో టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ఆధిక్యంలో ఉండటం రాజకీయ వర్గాలను సంచలనం గావిస్తోంది.
మొత్తం 234 స్థానాల అసెంబ్లీలో మెజారిటీ మార్క్ 118 కాగా, టీవీకే ఆ లక్ష్యానికి చేరువలో నిలవడం రాష్ట్రంలో కొత్త శకానికి సంకేతంగా మారింది. ప్రజల తీర్పు స్పష్టంగా మార్పును కోరుకుంటున్నదనే విషయాన్ని తెలియజేస్తోంది.

### ద్రావిడ రాజకీయాలపై ప్రజల తిరుగుబాటు

1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే తప్ప మరో పార్టీ అధికారానికి చేరువ కావడం ఇదే తొలిసారి. దశాబ్దాలుగా కొనసాగుతున్న కుటుంబ రాజకీయాలు, అవినీతి ఆరోపణలు, ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రభావం చూపాయి.
ప్రజలు ఈసారి కేవలం ప్రభుత్వాన్ని మార్చడం కాదు.. రాజకీయ వ్యవస్థనే మార్చాలని సంకల్పించినట్లు ఫలితాలు స్పష్టంగా సూచిస్తున్నాయి. ద్రావిడ పార్టీలపై ఉన్న అసంతృప్తి ఓట్ల రూపంలో బయటపడింది.

### సినిమా నుంచి రాజకీయాలకు విజయ్ అద్భుత మార్పు

సినిమా స్టార్‌గా కోట్లాది అభిమానులను సంపాదించిన విజయ్, ఇప్పుడు అదే అభిమానాన్ని ఓట్లుగా మలచడంలో అద్భుతంగా సఫలమయ్యారు. "సినీ నటులు రాజకీయాల్లో నిలబడలేరు" అన్న భావనను పూర్తిగా చెరిపివేస్తూ ఆయన తనదైన ముద్ర వేశారు.
ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి మహానేతల సరసన విజయ్ పేరు వినిపించడం ఇప్పుడు ఆశ్చర్యం కాదు. ప్రజలతో నేరుగా మమేకమై, సామాజిక అంశాలపై తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేస్తూ ఆయన రాజకీయంగా బలమైన పునాది వేసుకున్నారు.

### టీవీకే జైత్రయాత్ర.. మెజారిటీ దిశగా దూసుకెళ్తూ

ప్రస్తుతం టీవీకే 109 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, మరికొన్ని స్థానాల్లో పోటీ కఠినంగా కొనసాగుతోంది. చిన్న పార్టీల మద్దతు లేదా స్వతంత్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
విజయ్ నేతృత్వంలోని ఈ పార్టీ మొదటిసారి ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ, ప్రజల్లో విపరీతమైన ఆదరణ పొందడం విశేషం. ఇది సాధారణ విజయం కాదు.. రాజకీయాల్లో భారీ మార్పుకు సంకేతం.

### చెన్నైలో సంబరాలు.. పండుగ వాతావరణం

విజయ్ నివాసం, టీవీకే కార్యాలయం వద్ద కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ, పార్టీ పాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటున్నారు. చెన్నై నగరం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.




### కాంగ్రెస్‌కు ఆహ్వానం.. కొత్త రాజకీయ సమీకరణలు

విజయ్ తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ పార్టీ తమతో చేతులు కలపాలని ఆయన బహిరంగంగా పిలుపునిచ్చారు.
"కాంగ్రెస్‌కు గొప్ప చరిత్ర ఉంది.. కానీ అధికారాన్ని కోల్పోవడం వల్ల బలహీనపడింది. మాతో కలిసి వస్తే మళ్లీ పుంజుకుంటుంది" అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చే అవకాశముంది.

### 'మా కుమారుడు సీఎం అవుతాడు' –తండ్రి విశ్వాసం

విజయ్ భవిష్యత్తుపై పూర్తి నమ్మకంతో ఉన్న చంద్రశేఖర్, "ఇది కేవలం గెలుపు కాదు.. చరిత్ర. విజయ్ తప్పకుండా ముఖ్యమంత్రి అవుతాడు" అని ధీమా వ్యక్తం చేశారు. ఒక తండ్రిగా గర్వంగా ఉందని చెప్పారు.



### డీఎంకే, అన్నాడీఎంకేలకు భారీ ఎదురుదెబ్బ

మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకోవాలని ఆశించిన డీఎంకే శ్రేణులు తీవ్ర నిరాశలోకి వెళ్లాయి. మరోవైపు అన్నాడీఎంకే కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఇది కేవలం ఓటమి కాదు.. ద్రావిడ రాజకీయాలపై ప్రజల అసంతృప్తి ప్రతిబింబం.

### మార్పు కోసం ఓటు

ఈ ఎన్నికలు ఒక విషయం స్పష్టంగా చెప్పాయి – ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కొత్త నాయకత్వాన్ని స్వాగతిస్తున్నారు. సంప్రదాయ రాజకీయాలకు బదులుగా కొత్త దిశను ఎంచుకుంటున్నారు.
కొత్త శకం ప్రారంభం
తమిళనాడులో దళపతి విజయ్ నేతృత్వంలో టీవీకే ఎదుగుదల కేవలం ఒకపార్టీ విజయం కాదు.. ఇది ఒక రాజకీయ విప్లవం. 49 ఏళ్ల తర్వాత రాష్ట్ర రాజకీయ పటాన్ని పూర్తిగా మార్చే విధంగా ప్రజలు తీర్పు ఇచ్చారు.
ఇకపై తమిళనాడులో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉంది. స్టార్ నుంచి సీఎం దాకా విజయ్ ప్రయాణం ఇప్పుడు చరిత్రలో నిలిచే ఘట్టంగా మారుతోంది.

## పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం పకడ్బందీగా ప్రారంభమైంది. భారీ బందోబస్తు మధ్య లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముఖ్యంగా బెంగాల్‌లో అదనపు బలగాలను మోహరించారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా–నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతా బెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారం రోజే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపునకు కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రారంభమైంది.
ఎగ్జిట్ పోల్స్ భిన్న అంచనాలు ఇవ్వడంతో పోటీ చేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈసీ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికారిక ప్రవేశాన్ని అడ్డుకునేందుకు తొలిసారిగా క్యూ ఆర్ కోడ్ ఆధారిత ఫోటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది.
తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పైనే నిలిచింది. ఇక్కడ మొత్తం 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలు ప్రకటించనున్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దు చేయగా, అక్కడ ఈ నెల 21న మళ్లీ పోలింగ్ జరగనుంది. మమతా బెనర్జీ పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గ ఫలితంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతాను ఓడించిన విషయం తెలిసిందే. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో, ఓట్ల లెక్కింపునకు దాదాపు 2.5 లక్షల కేంద్ర బలగాలను నియమించారు. కేరళలో పోలింగ్‌కు ముందే కీలక పరిణామం చోటుచేసుకుంది. వామపక్ష కూటమి ఎల్‌డీఎఫ్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించి చరిత్ర సృష్టించిన సీఎం పినరయ్ విజయన్, తన పేరుకు ముందు ఉన్న 'సీఎం' పదాన్ని తొలగించుకోవడం సంచలనంగా మారింది. తన సోషల్ మీడియా ఖాతాలో 'కేరళ ముఖ్యమంత్రి' అనే పదాన్ని తొలగించి, 'సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు' అనే పదాలను చేర్చారు.
140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుపు ఖాయమని ఎక్కువశాతం ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవడంపై బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్ పోల్స్ కూడా మళ్లీ బీజేపీదే అధికారమని సూచించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా గెలుపుపై ఆశాభావం వ్యక్తం చేస్తోంది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. 2.50 కోట్ల ఓటర్లున్న అస్సాంలో 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపునకు 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపూ ఉదయమే ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి నేతృత్వంలోని 'ఏఐఎన్ఆర్సీ––బీజేపీ' కూటమిదే మళ్లీ అధికారమని సర్వేలు సూచించాయి.

## బెంగాల్‌లో బీజేపీ స్పష్టమైన ఆధిక్యం

- ఎస్ఆర్ ప్రక్రియతో ఓట్ల దోపిడీ చేశారని ఆరోపణలు
- మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు



కోల్‌కతా, నేటిధాత్రి:
పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 190 స్థానాల్లో ముందంజలో ఉండటంతో అక్కడ ప్రభుత్వం ఏర్పాటు దాదాపుగా ఖాయమైంది. ఈ నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఆర్) పేరుతో బీజేపీ ఓట్లను దొంగిలించిందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు.
"ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాలను విడిచిపెట్టొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది బీజేపీ పథకం. మొదటి రెండు, మూడు రౌండ్లలో వారే ఆధిక్యంలో ఉన్నట్లుగా చూపిస్తారని నేను ముందుగానే చెప్పాను. కొన్ని చోట్ల రెండు, మూడు రౌండ్ల తర్వాత కౌంటింగ్‌ను ఆపేశారు. టీఎంసీని అణచివేసేందుకు కేంద్ర బలగాలను బలవంతంగా ఉపయోగిస్తున్నారు. సీట్ల ఆధిక్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర బలగాలతో కలిసి ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. రాష్ట్ర పోలీసులు కూడా కేంద్ర బలగాలకు పూర్తిగా లోబడిపోయారు" అని మమత ఆరోపించారు. ఈ సందర్భంగా పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని ఆమె కోరారు. ఇంకా అనేక రౌండ్లు మిగిలి ఉన్నాయని, తుది ఫలితాల్లో తమదే విజయం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.
ప్రస్తుతం 293 సీట్లకు ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, 190 స్థానాల్లో బీజేపీ ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 97 స్థానాల్లో, కాంగ్రెస్ 1 స్థానంలో ముందంజలో ఉన్నాయి. ఇదే సమయంలో, కౌంటింగ్‌కు ముందు కూడా బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చోటుచేసుకున్నాయని, సీసీటీవీలు పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అనుమానాస్పదంగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇవన్నీ బీజేపీ ఆదేశాల మేరకే జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే సీసీటీవీ ఫుటేజ్‌ను డిమాండ్ చేయాలని కేడర్‌కు సూచించారు. మరోవైపు, కోల్‌కతాలోని ఖుదీరామ్ అనుశీలన స్టేడియంలో కెమెరా ఆఫ్‌లో ఉన్న కంప్యూటర్ స్క్రీన్ వీడియోను మమత కేబినెట్ మంత్రి శశి పంజా తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. ఆ వీడియోకు సంబంధించిన పూర్తి ఫుటేజ్‌ను చూపించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. శ్యాంపుకూర్ అసెంబ్లీ స్థానం నుంచి టీఎంసీ అభ్యర్థిగా శశి పంజా బరిలో ఉన్నారు.

# బీజేపీకి మరింత శక్తి!




డెస్క్, నేటిధాత్రి:
బెంగాల్, తమిళనాడు, కేరళ ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బీజేపీకే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం వేశారు. కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమతా బెనర్జీ, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బీజేపీకి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా, అందరి దృష్టి ప్రధానంగా బెంగాల్‌పైనే నిలిచింది. బెంగాల్లో మమతా బెనర్జీని బీజేపీ ఓడిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. అనుకున్నట్లుగానే మోదీ––అమిత్ షా ద్వయం బెంగాల్‌లో కూడా పాగా వేసింది. అస్సాంలో తన పట్టు నిలబెట్టుకుంది. కలకత్తా కాళీ కరుణించినట్టుగా బీజేపీకి పగ్గాలు అప్పగించబడ్డాయి. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడ మార్పు కోసం యత్నించనుంది.
దేశంలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బీజేపీ, కాంగ్రెస్ ఖాతాల్లో మరో రాష్ట్రం చేరగా, తమిళనాడులో టీవీకే పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారానికి చేరువైంది. డీఎంకే మళ్లీ గెలుస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి.
కేరళలో దశాబ్దం తర్వాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రానుంది. అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ తన అధికారాన్ని నిలబెట్టుకుంది. మొత్తంగా బెంగాల్‌లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం వేశారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చెప్పాలి.
కాంగ్రెస్‌కు కేరళ విజయం ఊరటనిచ్చింది. తమిళనాడులో పార్టీ స్థాపించి రెండేళ్లలోనే అధికారానికి చేరువైన విజయ్ ఒక విధంగా చరిత్ర సృష్టించాడనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు దక్షిణాది–హిందీ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శించిన డీఎంకేకు ప్రజలు గట్టి పాఠం చెప్పారు.
బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. బంగ్లాదేశ్ సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్‌లో అవినీతి, అధికార దురహంకారం పెరిగినట్లు విమర్శలు వచ్చాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా మార్చారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేకుండా పోయిందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.
ఓట్ల కోసం అక్రమ చొరబాటుదారులను ప్రోత్సహించారని, వారికి ఆధార్, ఓటరు కార్డులు మంజూరు చేశారని ఆరోపణలు వచ్చాయి. స్థానిక ప్రజలు నలిగిపోయారని, పరాయి వారిలా మారారని విమర్శలు వినిపించాయి. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు పెరిగాయని, వీటిని ఎదిరించిన వారిని అణచివేశారని ఆరోపణలు ఉన్నాయి. అందుకే పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే దేశ దృష్టి కేంద్రీకృతమైంది.
వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేక మమత పాలనకు బీజేపీ ముగింపు పలుకుతుందా? అనే ఉత్కంఠ నెలకొంది. దాదాపు 50 ఏళ్లపాటు పశ్చిమ బెంగాల్‌ను రెండు పార్టీలే పాలించాయి – 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్. కానీ ఈసారి బీజేపీ పాగా వేయడంతో కొత్త చరిత్ర రాయబడుతోంది.
2021 ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడిచింది. అప్పట్లో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలయ్యారు. గత ఐదేళ్లుగా బీజేపీ వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. ఇప్పుడు దానికి ఫలితం దక్కింది. బెంగాల్లో బీజేపీ కాషాయ జెండా ఎగరేయడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా చూడాలి.
ఈ విజయం మోదీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనం. గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయాలు సాధించిన టీఎంసీ నాలుగోసారి గెలుస్తుందన్న ధీమాతో ఉన్నప్పటికీ, ప్రజలు తిరస్కరించారు. మరోవైపు, బెంగాల్‌లో పాగా వేయాలని శక్తి యుక్తులన్నీ వినియోగించిన బీజేపీ తన విజయాన్ని సాధించింది.
ప్రధాని మోదీ, అమిత్ షాలు విజయోత్సవాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ఎక్కువగా బీజేపీకి అనుకూలంగా వచ్చినప్పటికీ, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలుస్తామని మమత ప్రకటించారు. అయితే ఓటర్లు బీజేపీకే పట్టం కట్టారు.
కేరళ విషయానికి వస్తే, ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరుకు ముందు ఉన్న 'సీఎం' పదాన్ని తొలగించుకున్నారు. వృద్ధాప్యం, అవినీతి ఆరోపణలు, కుంభకోణాల కారణంగా విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ లేదా యూడీఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీ. గత పదేళ్లలో పినరయ్ విజయన్ ప్రభావం తగ్గిందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడీఎఫ్‌కు అధికారం దక్కే పరిస్థితి ఏర్పడింది.
తమిళనాడులో ఓట్ల లెక్కింపుకు ఒక రోజు ముందే రిసార్ట్ రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి హంగ్ వస్తుందని భావించిన టీవీకే అధినేత దళపతి విజయ్ తన ఎమ్మెల్యేలందరిని రిసార్ట్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. కానీ అనూహ్యంగా ఆయనే కింగ్‌గా మారారు. పూర్తి మెజార్టీకి కొద్దిగా దూరంలో ఉన్నప్పటికీ, ఇతర పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి కనిపిస్తోంది.
ఈ క్రమంలో అన్నాడీఎంకే రెండో స్థానంలో నిలిచి సత్తా చాటింది. సాధారణంగా ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు చోటుచేసుకుంది. దశాబ్దాలుగా డీఎంకే–అన్నాడీఎంకే మధ్యే రాజకీయాలు సాగుతుండగా, ఇప్పుడు 'తమిళ వెట్రి కళగం' (టీవీకే) ప్రవేశంతో సమీకరణాలు మారాయి.
స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసినా, ఫలితాలు భిన్నంగా వచ్చాయి. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీకి 120 వరకు సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఇప్పుడు తమిళనాడులో కొత్త రాజకీయ శకం ప్రారంభమైనట్టే కనిపిస్తోంది. మొత్తంగా ఈ ఫలితాలు బీజేపీలో ఆశావహ దృక్పథాన్ని పెంచాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంతమేర ప్రభావం చూపిందని చెప్పవచ్చు.

## దేశమంతా డబుల్ ఇంజిన్ సర్కార్ ఖాయం

- స్థానిక వ్యతిరేకతతోనే కేరళలో కాంగ్రెస్ విజయం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్య



కరీంనగర్, నేటిధాత్రి:
దేశమంతా ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో అరాచకాలు జరిగాయని, బంగ్లా చొరబాటుదారులకు మార్గాలు సుగమం చేశారని ఆయన పేర్కొన్నారు. దేశం మొత్తం బీజేపీని కోరుకుంటోందని ఉద్ఘాటించారు.
సోమవారం కరీంనగర్‌లో పర్యటించిన బండి సంజయ్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని కావాలని సీఎం రేవంత్ రెడ్డి కలలు కంటున్నారని విమర్శించారు. సీఎం ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.
కేరళలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కారణంగానే కాంగ్రెస్‌కు ఈ ఫలితాలు అనుకూలంగా వచ్చాయని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకున్నారని తెలిపారు. బీజేపీకి అసలు ప్రచారకర్త రాహుల్ గాంధీయేనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.
ఉత్తరాది––దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేయాలని ప్రయత్నించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లోనూ ప్రధాని మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఏర్పడతాయని ధీమా వ్యక్తం చేశారు.
కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెల్లరీ దుకాణంలో జరిగిన కాల్పుల ఘటనలో గాయపడిన బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పాల్సిన సమయంలో ఈ ఘటనను రాజకీయ కోణంలో చూస్తున్నారని విమర్శించారు. దుకాణ యాజమాన్యంతో మాట్లాడి, బాధితులకు పూర్తి సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

## తెలంగాణలోనూ ఇక బీజేపీ ఖాయం

- ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వ్యాఖ్యలు





హైదరాబాద్, నేటిధాత్రి:
తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి గట్టి సందేశం ఇచ్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పేర్కొన్నారు. ఈ ఫలితాలను పరిశీలిస్తే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వ్యాఖ్యానించారు.
గత 33 ఏళ్ల పాటు కమ్యూనిస్టులు, అనంతరం 15 ఏళ్ల పాటు తృణమూల్ కాంగ్రెస్ పాలించిన పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అస్సాంలో మూడోసారి బీజేపీ కూటమి అధికారంలోకి వస్తోందని తెలిపారు. కుటుంబపాలన, అవినీతి లేని పాలన అందించడంతోనే అస్సాంలో మళ్లీ తమ పార్టీకి ప్రజలు మద్దతు ఇచ్చారని చెప్పారు.
ఉత్తరాది–దక్షిణాది విభజనలను ప్రోత్సహించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన సమాధానం ఇచ్చారని అన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ క్రమంగా బలహీనపడుతోందని వ్యాఖ్యానించారు.
కూకట్‌పల్లి ప్రాంతం నుంచి మైనార్టీలు బీజేపీలో చేరుతున్నారని, ముస్లిం మహిళలు ప్రధాని నరేంద్రమోదీని పెద్దన్నగా భావిస్తున్నారని తెలిపారు. మే 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

**Printed, Published & owned by Katta Raghavender Rao,** Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
**Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail :** netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999